# కాంట్రాక్టర్ల అదురు

6-6-90

పాడేరు, జూన్ 5 (న్యూస్‌టుడే): విశాఖ ఏజెన్సీలోని గిరిజన కూలీలకు చెల్లించే కూలిరేట్లు పెంచాలని, తుపానుకు సర్వం కోల్పోయిన గిరిజనులను ఆదుకునేందుకు వీలుగా కాంట్రాక్టు సొమ్ములో పది శాతం నిధుల్ని తమకు విరాళంగా ఇవ్వాలని పాడేరు డివిజన్‌కి చెందిన కాంట్రాక్టర్లను తీవ్రవాదులు కోరడంతో వారి గుండెల్లో గుబులుపుట్టింది. తాము కోరినట్లుగా కాంట్రాక్టర్లు సొమ్ము చెల్లించకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవల్సి వస్తుందని తీవ్రవాదులు హెచ్చరించడంతో ఏజెన్సీలోని పలు నిర్మాణాలను కంట్రాక్టర్లు ఆపేసేందుకు నిర్ణయించుకున్నారు. ఈనెల 22న కాంట్రాక్టర్ల యూనియన్ నాయకుడిని తీవ్రవాదులు పిలిచి ఏజెన్సీలో కూలీలకు ఇస్తున్న పద్నాలుగు రూపాయల రోజుకూలీ వారికేమాత్రం సరిపోవడంలేదని ఈ రేటును పద్దెనిమిది రూపాయలకు పెంచాలని డిమాండు చేసినట్లు తెలిసింది. కాంట్రాక్టు సొమ్ములో ఎనిమిది నుంచి పదిశాతం వరకు నిధులు తమకందించాలని వారు కోరారని తెలియవచ్చింది.

ఈనెల 29న పాడేరు డివిజన్ పరిధిలోని కాంట్రాక్టర్లందరూ ఈ విషయాన్ని చర్చించేందుకు పంచాయతీరాజ్ గిరిజన సంక్షేమశాఖ అధికారులతో కలిసి ఈనెల 29న సమావేశమయ్యారు. తీవ్రవాదులకు సొమ్మిచ్చేందుకు వీలుగా ఎస్టిమేట్లపై మరో పది శాతం నిధులు అదనంగా తమకందజేయాలని కాంట్రాక్టర్లు అధికారులను కోరినట్లు తెలిసింది. అయితే ఈ విషయమై అధికారులు మాత్రం సమాధానమేమీ చెప్పలేదు. ప్రాజెక్టు అధికారి దృష్టికి ఈ వ్యవహారాన్ని తీసుకెళతామని అధికారులు హామీ ఇచ్చారని తెలియవచ్చింది.

## పనులు ఆపేయాలని నిర్ణయం

నక్సలైట్లు కోరినట్లు తాము సొమ్ము చెల్లించలేమని ఈ కారణంగా పాడేరు డివిజన్ పరిధిలోని నిర్మాణంలో ఉన్న ఇంజినీరింగ్ పనుల్ని ఆపేయాలని కాంట్రాక్టర్లు నిర్ణయించుకున్నారు. ఏజెన్సీలో మే ముప్పయ్యోతేదీ నుండి ఏ నిర్మాణాలు జరగవని కాంట్రాక్టర్లు చెప్పారు. ఏజెన్సీలో కూలీలకు రోజుకు పద్దెనిమిది రూపాయలు ఇవ్వాలంటే తమకు ముప్పైశాతం వరకు నష్టం వస్తుందని వీరు అన్నారు. ఏజెన్సీ వాతావరణంలో తక్కువ సమయమే కూలీలు పనిచేయగలరని, ఇందువల్ల నిర్మాణపు పనులు మెల్లగా సాగుతాయని వారు పేర్కొన్నారు. ప్రభుత్వం తమకు కాంట్రాక్టు పనులపై పదిశాతం అదనంగా నిధులు మంజూరు చేస్తేగాని ఏజెన్సీలో నిర్మాణాలు పునఃప్రారంభం కావని కంట్రాక్టర్లు పేర్కొన్నారు.